# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### కాంగ్రెస్ వచ్చేదిలేదు.. సచ్చేదిలేదు

కాంగ్రెస్ ప్రభుత్వంలో రాత్రిపూట సమయం సందర్భం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ సరఫరా అయ్యేది. దాంతో బోరుమోటర్ల వద్ద పడికాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి సమస్యల్లేవు. ఇప్పుడు 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్ అని రేవంత్‌రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతుల బతుకులు ఆగమవుతాయి. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సమస్యలు లేకుండా రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటారు. కాంగ్రెస్ వచ్చేదిలేదు.. సచ్చేదిలేదు.. నా మద్దతు బీఆర్ఎస్‌కే.

**-వెంకటేశ్ చారి, బెన్నూర్, యాలాల**

### మళ్లీ బావులకాడ పడుకోవాలా..

కాంగ్రెస్ నేతలు ఎవుసం గురించి ఏదేదో మాట్లాడుతున్నారు. వాళ్లకు ఏం తెలియదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే మూడు గంటలు సరిపోతుందని వంకరగా మాట్లాడుతున్నారు. మమ్మల్ని మంచిగా బతకనియ్యరా, మళ్లీ కరెంటు తిప్పలు పెట్టి బాయిల వద్ద పండుకోమంటారా..? కాంగ్రెసోళ్ల పాలనలో ఎన్నో కష్టాలు పడ్డం. తెలంగాణ వచ్చినంక ఈ తొమ్మిదేండ్లలో ఏ రంది లేకుంటా ఎవుసం చేసుకుంటున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మూడు గంటలు కరెంటు ఎట్ల సరిపోతది. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకున్నా ఒక పొలానికే సరిపోతది. వేరే పంటలెట్ల.. ఆ టెన్ హెచ్‌పీ మోటర్లను కాంగ్రెసోళ్లు కొనిస్తారా.. మళ్లీ కేసీఆర్ సార్ సీఎం అయితేనే రైతులకు కష్టాలు ఉండవు. మేము బీఆర్ఎస్‌కే అండగా ఉంటాం.

**-శ్రీనివాస్, ధారూరుస్టేషన్ , ధారూరు**



3 గంటల కరెంటుతో బతుకులు ఆగం..

10 హెచ్‌పీ మోటర్లతో మోయలేని భారం

శనిలా దాపురించిన కాంగ్రెస్ పార్టీని తరిమికొడుతామంటున్న రైతులు

# కాంగ్రెస్ అంటేనే.. కటిక చీకట్లు



వికారాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తదా అని రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. మళ్లీ కాంగ్రెస్‌కు అవకాశమిస్తే కరెంట్ కష్టాలు తప్పవని జిల్లాలోని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. 10 హెచ్‌పీ మోటర్లతో 3 గంటల్లో మూడెకరాలకు నీళ్లు పెట్టొచ్చన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం మండిపడుతున్నది. మూడు గంటల్లో పొలంలో ఓ మూలకు కూడా పారదని, మళ్లీ విద్యుత్తు షాక్‌లతో ఆత్మహత్యలు, అర్ధరాత్రి పొలాల వద్ద పడిగాపులు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కరెంట్ కష్టాలతో బోర్లు, బావులలో నీరున్నా సాగు చేసుకోలేని దయనీయ పరిస్థితి వస్తుందంటున్నారు. ప్రస్తుతం రైతులు బోర్లు, బావులకు వినియోగిస్తున్న 5 హెచ్‌పీ మోటర్లకు బదులు 10 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తే రైతులకు, ప్రభుత్వానికి అదనపు భారం కానున్నది. అంతేకాకుండా మూడు గంటల కరెంట్‌తో కనీసం ఓ మూలకు కూడా తడవని పరిస్థితి దృష్ట్యా సాగులో ఉన్న భూములు కూడా బీడు భూములుగా మారే పరిస్థితులున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా, ప్రస్తుతం సాగులో భూములు 6 లక్షల విస్తీర్ణానికి పెరిగింది. అన్నదాతలను ఇబ్బందులకు గురి చేసే కాంగ్రెస్‌ను అధికారంలోకి రానియ్యమని వారు ముక్తకంఠంతో చెబుతున్నారు.

### కరెంట్ ఇవ్వని కాంగ్రెస్‌ను ఓడిస్తాం

మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్‌కు ఓటేసే ప్రసక్తే లేదు. ఉచితంగా 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మూడోసారి కూడా కేసీఆర్‌ను సీఎంగా చేస్తాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి బాధలో ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతున్నాయి. 24 గంటల కరెంట్‌తో వ్యవసాయంపై నమ్మకం వచ్చింది. ఏడాదిలో మూడు పంటలు పండిస్తూ సంతోషంగా ఉన్నాం. బీఆర్ఎస్‌కే నా మద్దతు.

**- నర్సింహులు, రెడ్డిఘణపూర్, బషీరాబాద్**



### మోటర్లు ఉండవు.. ట్రాన్స్‌ఫార్మర్లు కనిపించవు

కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు మూడు గంటలపాటు కరెంటు ఇస్తే రైతులందరూ ఆగమవ్వడం ఖాయం. ఎందుకంటే బోరుబావుల వద్ద ఉన్న మోటర్లను ఒకేసారి రైతుందరూ స్టార్ట్ చేస్తరు. లోడ్ ఎక్కువై మోటర్లు కాలిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పాడైపోతయ్. అప్పుడు రైతులందందరికీ ఇబ్బందులు ఎదురవుతాయి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నరు. రైతులు బాగుపడటం కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం ఇష్టం ఉండదు. రైతుందరికీ నిరంతర కరెంట్, రైతుబంధు కావాలంటే కాంగ్రెస్ పార్టీ రావొద్దు. బీఆర్ఎస్‌కే నా మద్దతు.

**-జామ్లానాయక్, సంగాయిపల్లితండా, మహ్మదాబాద్**



### ఏనాడు కంటి నిండా నిద్రపోలే

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సంతోషంగా ఉన్నాం. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఏనాడు కంటి నిండా నిద్రపోలేదు. కరెంట్ కోసం రాత్రంతా జాగారం చేశాం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అన్నదాతల బాధలు తీరాయి. 24 గంటల కరెంట్‌తో ఎప్పుడంటే అప్పుడు వెళ్లి పొలాలకు నీటిని పెట్టుకుంటున్నాం. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వారి అవివేకానికి నిదర్శనం. మాకు కాంగ్రెస్ ప్రభుత్వం వద్దే వద్దు. సీఎం కేసీఆర్ ప్రభుత్వమే కావాలి.

**-గొవిందు, రైతు మద్దూర్ (కొత్తపల్లి )**



### మళ్లీ అర్ధరాత్రి పొలాలకు పంపిస్తారా?

తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్న కరెంట్ సౌకర్యంగా ఉన్నది. ప్రస్తుతం ఎలాంటి సమస్యల్లేవు. ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు మోటర్లు కాలిపోవడంలేదు. ఎప్పుడంటే అప్పుడెళ్లి పంటలకు నీటిని పెట్టుకుంటున్నాం. గత కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు పోయ్యేదో, వచ్చేదో తెలిసేది కాదు. గతంలో పొలానికి నీరు పెట్టేందుకు అర్ధరాత్రి, తెల్లవారుజామున పోవాల్సి వచ్చేది. మూడు గంటల కరెంట్ చాలు అన్న కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతాం. 24 గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ అధికారంలోకి మళ్లీ వచ్చేలా మా మద్దతు ఇస్తాం.

**- బుచ్చయ్య రైతు, తుర్కెంఎన్కెపల్లి; పూడూరు**





### రైతులు మళ్లీ కాంగ్రెస్‌ను నమ్మరు

మూడు గంటల కరెంటుతో రైతులకు ఎంతో నష్టం జరుగుతుంది. అప్పట్లో కాంగ్రెస్ రాజ్యంలో కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ విద్యుత్తు సమస్యను పరిష్కరించారు. కాంగ్రెస్ కాలంలో కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేవి. ఎన్నోసార్లు రైతులు కరెంట్ ఆఫీసర్లను రూమ్‌లో వేసి తాళం వేసిన రోజులున్నాయి. అప్పటి రోజులు ఇంకా గుర్తుకున్నాయి. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే మూడు గంటలే కరెంట్ ఇస్తామంటున్నారు. మూడు గంటల్లో పంటలు ఎట్లా పండించాలి. ఇప్పుడు 24 గంటల కరెంట్‌తో ప్రమాదాలు తగ్గిపోయాయి. రైతులు ఇంకా కాంగ్రెస్‌ను నమ్మరు, మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే గెలిపించుకుంటాం. నా మద్దతు సీఎం కేసీఆర్‌కే.

**-వీరారెడ్డి, చిన్ననందిగామ, కొడంగల్.**

### కాంగ్రెస్ హయాంలో అరిగోస

కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోసం తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతోందో తెలియని కరెంట్‌తో పొలాల వద్దే ఉండాల్సి వచ్చింది. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే అన్నదాతలకు మంచి రోజులొచ్చాయి. 24 గంటల కరెంట్‌తో పంటలను పండించుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాం. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఇచ్చే హామీలను నమ్మొద్దు. వారు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేదిలేదు. అన్నదాతకు అండగా ఉన్న సీఎం కేసీఆర్‌కే నా ఓటు. బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

**-నారాయణ, ఆలంపల్లి, వికారాబాద్**

